# "మేరి"

**"రేణు"**

అతడొక ఫకీరు

వెండితీగలగడ్డం విశాలవక్షస్థలం మీదికి ప్రాకుతోంది. ఉతికిన బట్టవంటి ముడుతలుపడిన శరీరం. జీవశక్తిని యీనుతున్న దీర్ఘనయనాలు, విరివిగల నుదురు, పొడుగుపాటిముక్కు——

చేత లాంతరుపట్టుకుని ఆ నిశీథంలో గిలకను త్రిప్పుతూ.

—— మీపిల్లల్‌కి
జెల్లల్‌కి
సల్లాగఉండాలి
మీపాడీపంటల్
వృద్ధిపొందాలి...
అల్లాకెనాం......

——అంటూ నిశీథం ప్రతిధ్వనించే కంఠంతో పాడుకుంటూ పోతున్నాడు. ఆకాశవీధిని మిణుకు మిణుకుమంటున్న నక్షత్రాలు, చెట్లమీద శబ్దంచేస్తూన్న కీటకాలు, ఊరుబైట కూనిరాగాలు తీస్తున్ననక్కలు, తప్ప మరెవ్వరు ఆపాటని ఆలకించటంలేదు.

: అంకితం :
మేరీవంటి కృతజ్ఞజీవులకు

బాటప్రక్కనఉన్న మురికికాలవలో కుక్కపిల్ల కూనిరాగాలు తీస్తూవుంది. ఆ జాలిహృదయం కాళ్లను బంధించింది, కంఠాన్ని అరికట్టింది. ఫకీరు తన లాంతరుపైకెత్తి దరికిపోయాడు. చిన్నకుక్కపిల్ల కాళ్లు చేతులు గిజగిజాతన్నుకుంటూ ఉత్కృష్టంపడుతూంది. మెమ్మదిగా పైకితీసాడు.

*      *      *      *

దానికేం ఉపచారంచేసేడో ఆఫకీరుగాని అప్పటికి ఆకుక్క చాల బలంగాఉంది. ఫకీరుముందు లాంతరు నోటితో కరుచుకొనిపోతుంది ఆకుక్క. ఫకీరు గిలకను త్రిప్పుతూ కంచుగొంతుకతో పాటపాడుకొంటు పోతున్నాడు. ముందు నడుస్తున్నకుక్కను ఆశ్చర్యముగా చూస్తున్నారందరు.

దయగల హృదయాలు ధర్మం చేస్తున్నాయి—కొంతమంది-అడుక్కోటానికి యిదో ఎత్తని పడతిడుతున్నారు.

లోకం తనుగురించి ఏమనుకొంటున్నారోననే దిగులే లేదు అతనికి. తనగిలక తాను, తన్మయత్వములో తేలిపోతున్నారు.

అక్కడక్కడ కుక్క లాంతరును క్రిందపెట్టి ఆగుతోంది. పాట పూర్తికాగానె నడకసాగిస్తుంది.

*      *      *      *

ఆరోజు ఫకీరుకి తినటానికికూడ యేమిదొరకలేదు—హోరునవర్షం —— తనకుక్క తాను ఒకరిముందు ఒకరు కూర్చుని మూగభావంలో ముచ్చట్లాడుకుంటున్నారు. ఆకుక్క ఉండీఉండీ చటుక్కుని పరుగెత్తుక వెళ్లిందెక్కడికో ఆశ్చర్యముతో చూస్తున్నాడు ఫకీరు. ఒక నిమిషానికల్లా వర్షంలో తడుస్తూ పెద్దరొట్టెఒకటి నోట్లో కరచుకొనివచ్చిఫకీరువడిలోపెట్టిందికుక్క. ఫకీరికి వింత, ఆనందం ఒక్కసారి కలిగాయి. నోరులేని ఆహృదయం తన హృదయవేదన కారొట్టెతెచ్చినందుకు నివ్వెరపడ్డాడు. కొంచంముక్కవిరచి దానిముందువేసి తానారొట్టెని తుడుచుకొని తింటున్నాడు కాని కుక్క మాత్రం ఆముక్కను అంటకుండా యిదికూడా నీవే తినమన్నట్టుగా సంజ్ఞచేస్తోంది.

మాటలునేర్చిన ఆకుక్క హృదయంజ్ఞానం తెలియని మానవహృదయంకంటె యెన్నిరెట్లుమేలో !

*      *      *      *

## నిశిరాత్రి

వర్షంకురిసి కురిసి అప్పుడే వదలింది. మేఘాల్ని పొడుచుకుంటూ వస్తున్నాయి చుక్కలు. అక్కడక్కడ వర్షపునీరు గుంటల్లో నిలిచివుంది.

ఫకీరు ఒంటరిగావస్తున్నాడు; వెనకనీళ్లు జిమ్ముకుంటూ వస్తూంది కుక్క.

అది నాల్గురోడ్లమొగ—అక్కడవరకూ వచ్చి దారితెలియక నిలబడిపోయాడు ఫకీరు—ఒక కానిస్టేబులు వచ్చి ఫకీరుని పట్టుకున్నాడు ఒక తన్నుతన్ని—'మాదర్‌ఛోద్..'అని యేమో అనబోతూండగానే కుక్క పోలీసు పిక్కపట్టుకున్నది. కెవ్వున కేక వేశాడు పోలీసు. ఫకీరు కుక్కను పట్టుకుని ఆపు చేసాడు. పోలీసు జేబునుంచి విజిల్ వేసి ఊదాడు; యింకోపోలీసు తూలుతువచ్చాడు అక్కడికి; యిద్దరు కలిసి ఆ ఫకీరుని పట్టుకుని స్టేషనుకు తీసుకుపోయారు. ఆకుక్కకూడావస్తే దాంట్లో ఒక పోలీసు కర్ర యెత్తి కొట్టాడు. దూరందూరంగా వాళ్లననుసరిస్తూ స్టేషనుకు పోయింది కుక్క.

* * * *

అప్పటికి మూడురోజులనుంచి రిమేన్డులో ఉన్నాడు ఫకీరు—యెందుకు?

అంతకుముందు ఆవూళ్లో రెండుమూడు చోరీలు జరిగాయి. చోరీని పట్టుకోలేని అసమర్థులు ఫకీరే చోరీ అన్నారు. పాసిక్షి'కం నమ్మింది కూడాను.

కుక్క గేటుముందుఉన్న రావిచెట్టువద్ద కూర్చుని ఫకీర్ని చూస్తూ విలపిస్తూంది; ఫకీరు లోపల్నుంచి పొమ్మని సంజ్ఞచేస్తూన్నాడు పోలీసులు. అనేకసార్లు రాళ్లురువ్వారు ఆకుక్కమీదికి; తిరిగి అక్కడికేవచ్చి ఫకీరు కనబడేటట్టు కూర్చుంటూంది.

ఆరోజు ఫకీర్ని కోర్టుకు తీసుకుపోయేరోజు. నిండు దుస్తులతో పోలీసులు ఫకీర్ని రైలుస్టేషనుకు తీసుకొస్తున్నారు. కుక్క దీనంగా విలపిస్తూ వాళ్లను వెన్నాడింది. బండిరాగానే ఫకీర్ని బండి యెక్కించారు పోలీసులు. కుక్కకూడ బండివద్దకువచ్చి పెట్టెలోకి ఉరకపోయింది. పోలీసులు కర్రలతో మోదారు రైల్ కూలీలు రాళ్ళతో రువ్వి వెదలకొట్ట ప్రయత్నించారు. యెంతకొట్టినా ఆకుక్క అక్కడనుంచి కదిలిందే కాదు.

బండి కదిలింది-కుక్క బండితోకూడా పరుగెత్తడం మొదలుపెట్టింది. రెండుమూడు ఫర్లాంగులు బండితో సరిగా పరుగెత్తింది. ఫకీరు—పోలీసులు—బండిలో ప్రయాణీకులు—ఆతురతతో వింతగా పరీక్షిస్తున్నారు. చాలవరకు పరుగెత్తి పరుగెత్తి ఒకగంతువేసింది రైలు మీదకు తలుపుతగిలి బండిక్రింద పడింది.

యినపచక్రాలు ఆకుక్కను నవిలేశాయి.

ప్రయాణీకులందరు అయ్యోపాపం యెవరిదా కుక్కన్నారు. ఆపెట్టెలోఉన్న ఒక ప్రయాణీకుడు—అసలు ఆకుక్కనాదే—దాని పేరు మేరీ—జబ్బుచేయుట చేత వదలివేశాను—యిప్పుడు దాన్ని యెవరుపెంచుతున్నారో మరి—అన్నాడు.

ఫకీరు 'మేరీ'అంటూ రెండశ్రుధారలు వదిలాడు. బండి శరవేగన్నపోతుంది.